

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### నేటి కథ

**హాల్లోని** సోఫాలో నిశ్చేష్టురాలై కూర్చుని ఉంది భవాని. లోపల గదిలోంచి ఇంగ్లీష్‌లో అరుపులు, కేకలు, తిట్లు. ఒక్కోవస్తువు బయటకి వేగంగా దూసుకు వస్తోంది. పౌడర్, క్రీమ్‌లాంటి సౌందర్య సాధనాలన్నీ అయిపోయాక ఓ పెరఫ్యూం సీసా వచ్చి భవాని ముందు నేలమీద పడి భళ్ళున బద్ధలై సుగంధం వ్యాపించింది.. అది తన తలకి తగలనందుకు సంతోషిస్తుండగా సగం తాగిన కోక్ సీసా వచ్చి భుజానికి గుద్దుకుంది. భుజం తడుముకుంటూ లేచి ఓ మూలగా ఉన్న స్టూల్ మీద కూర్చుంది. హేంగర్లు, దువ్వెనలు, నెయిల్ పాలిష్‌లు లాంటివి వచ్చి పడ్డాక భళ్ళున లోపల గది తలుపు మూసుకున్న శబ్ధం వినిపించింది. వెంటనే మరో గది తలుపు కూడా మూసుకున్న శబ్ధం ఇంకా గట్టిగా వినిపించింది.

భర్తమాట వినక తను పొరపాటు చేసిందా అనుకుంది భవాని. ఆమెకి ఇదంతా చూస్తూంటే దడగా ఉంది. ‘అనవసరంగా వచ్చాను. రాకపోతే, ఏదో అది సుఖంగా కాపురం చేసుకుంటోంది అనుకునేదాన్ని.‘ పదోసారి అనుకుంది.

కొద్దిసేపటికి ఓ గది తలుపు తెరుచుకుని బయటకి వచ్చిన అతను విసురుగా బయటకి వెళ్ళిపోయాడు. మరోపావుగంట అలా కూర్చున్నాక భవాని టైం చూసుకుంది. మధ్యాహ్నం మూడైంది. ‘పర్లేదు. బస్‌కి ఇంకా చాలా టైం ఉంది‘ అనుకుంది.

ఎంత నచ్చ చెప్పినా వినకుండా కూతురు లవ్‌మేరేజ్ చేసుకుందని ఇంకా కోపంగానే ఉన్న భర్త గట్టిగా చెప్పాడు.

"నీ చెల్లిలి కొడుకు పెళ్ళికాకపోతే నిన్ను హైద్రాబాద్ పంపేవాడినేకాదు. వెళ్ళి పెళ్ళి చూసుకుని బుద్ధిగా పెళ్ళివాళ్ళతో వచ్చెయ్. వర్ష ఇంటికి వెళ్ళొద్దు. అంతగా చూడాలనుకుంటే దాన్ని పెళ్ళికి రమ్మను. అంతేకానీ వాళ్ళింటికి మాత్రం వెళ్ళకు. పెళ్ళిచేసినా దానికి మన సపోర్ట్ లేదని వర్షకి తెలిసి రావాలి."

భవానిదీ అదే ఆలోచన. తనతో పని చేసే అతన్ని పెళ్ళి చేసుకోడానికి కూతురు ఇంట్లో చేసిన గొడవ, అల్లరికి ఆమెకి విరక్తి పుట్టింది. భర్తని ఒప్పించి పెళ్ళిచేసి పంపింది కానీ ఆ తర్వాత కూతురుతో పెద్దగా మాట్లాడలేదు. వర్షే వారానికోసారి ఫోన్ చేసి నాలుగైదు నిమిషాలు మాట్లాడుతూంటుంది. ఎక్కువగా భర్తమీద కంప్లైంట్సే. ఆదివారమే కాబట్టి పెళ్ళికి తప్పక వస్తానని చెప్పింది.

అన్నట్లే వచ్చింది. మధ్యాహ్నం భోజనాలయ్యాక చెప్పింది. "పెళ్ళయిపోయింది. మీ బస్సు రాత్రి 9కి బయలుదేరుతుందని బాబాయ్ చెప్పాడు. అప్పటిదాకా ఇక్కడేం చేస్తావు? మా ఇంటికి వెళ్దాం పద."

"లేదు. రాను. చాలామంది చుట్టాలని చాలారోజుల తర్వాత కలిసాను. మేము కబుర్లు చెప్పుకోవాలి" భవాని నిరాకరించింది.

"అంటే నీకు కూతురెక్కువా? లేక చుట్టాలా?" వర్ష స్వరం పెరిగింది.

"ష్! మెల్లిగా."

"నీ స్వంత కూతురింటికి నువ్వేరావాలి. కానీ నేను బతిమాలుతున్నా రానంటావేం?"

అరిచి బాబాయ్‌తో చెప్పింది. "బాబాయ్. అమ్మని తీసుకెళ్తున్నాను. సాయంత్రం దింపేస్తాను."

ఇంట్లో సోఫాలో కూర్చుని టి.వి చూస్తున్న అల్లుడు అత్తగారిని చూసి నవ్వి 'కైసే హై' అని అడిగాడు. భవాని అది అర్థం చేసుకుని బానే ఉన్నాను అన్నట్లు తలూపి, అతన్ని తిరిగి పరామర్శించడానికి భాష రాదే అని బాధపడింది.

ఇల్లు శుభ్రంగా లేదు. ఆగమాగంగా ఉంది.

"ఇదేంటి చిన్నా. ఇల్లు అరణ్యంలా ఉంది?" అడిగింది.

"పొద్దున వెళ్తే రాత్రికి వస్తామమ్మా ఓపిక ఉండదు. వీకెండ్ ఎటో అటు వెళ్ళి తిరిగిరావడం, పడుకోవడం. ఈ మాత్రం ఉందంటే నిన్నంతా పడీపడీ సర్దాను. ఇవాళ నువ్వొస్తావని" చెప్పింది వర్ష.

"అయ్యో! డబ్బున్నా సుఖంలేని ప్రాణాలు" ఉసూరుమంది భవాని.

మాట్లాడుతూ బెడ్‌రూంలో మంచం మీద పోసి ఉన్న ఆరిన బట్టలన్నీ మడత పెడుతూంటే, అల్లుడు లోపలికి వచ్చాడు. భవాని బయటకి వచ్చింది.

కొద్దిసేపటికి లోపలనించి అరుపులు, కేకలు విసురుగా వచ్చిపడే వస్తువులు.

భవాని నిట్టూర్చి లేచి హాల్‌ని సర్దుదామనుకుని, ఓసారి తన పట్టుచీర వంక చూసుకుని వంటింట్లోకి వెళ్ళింది. మేకుకి తగిలించి ఉన్న వర్ష ఏప్రాన్‌ని తీసి కట్టుకుని వంటగదిని చూసి అదిరిపడింది. స్టవ్‌నిండా పాలు, పులుసులులాంటివి పొంగి అట్టలు కట్టి ఉన్నాయి. పంచదార, కాఫీపొడి దేనికీ మూతల్లేవు. ఎప్పుడు వండిన అన్నమోకాని మూతలేకుండా అక్షింతల్లా అయిపోయి వుంది. ఇన్‌స్టెంట్ చపాతీల కవర్ ఫ్రిజ్‌లో కాక ప్లాట్‌ఫాం మీద ఉంది. టేబుల్ మీద డస్ట్‌బిన్ నిండా తినిపడేసిన హోటల్ పార్సిల్ కవర్లు.

భవానికి అసహ్యంతో ఒళ్ళు జలదరించింది. బాల్కనీ తలుపు తీసి చూస్తే ఓ మూల చీపురు కనిపించింది. మొదట వంటగదిని శుభ్రం చేయడం మొదలు పెట్టింది. గోడలకి ఉన్న టైల్స్ మీద నూడుల్స్ కూరగాయల అవశేషాలు అతుక్కుని ఉన్నాయి. ఓ గరిటతో వాటిని గీరి బట్టతో తుడిచింది. 'బహుశా వంటగదిలో దెబ్బలాడుకుని ఉంటారు' అనుకుంది విరక్తిగా. కిచెన్‌ని ఓ కొలిక్కి తెచ్చాక హాల్‌లోకి వచ్చింది.

గాజుపెంకుల్ని జాగ్రత్తగా ఏరి పడేసి, నేలమీది అన్ని వస్తువులని ఓ చోట పెట్టి శుభ్రంగా ఊడ్చింది. ఈ చప్పుళ్ళకి తలుపు తెరచుకుని వచ్చిన వర్ష అరిచింది.

"నువ్వెందుకు చేస్తున్నావు? రేపు సర్వెంట్ వస్తుందిలే."

"నీకు సర్వెంట్ కూడా ఉందా?" భవాని ఆశ్చర్యపోయింది.

"ఆఁ దాని దగ్గర ఇంకో కీ ఉంది. మేం ఆఫీసులకి వెళ్ళిపోయాక వచ్చి పనిచేసి పోతుంది. మా గోల విన్నావుగా. నాన్నకేం చెప్పకు. దరిద్రం.. దరిద్రం. దరిద్రపు మొగుడు దొరికాడు. ఎప్పుడో వాడ్ని చంపేస్తా.." కోపంగా చెప్పింది.

ఆధునిక దుస్తుల్లో ఉన్న కూతురు అచ్చ తెలుగుభాషలో మొగుడ్ని తిడుతూంటే భవానికి నవ్వొచ్చింది.

"మా గొడవకి నీకు బాధేయలేదు? ఎంత దుర్మార్గుడో తెలుసా అమ్మా? అసలు ఈ పెళ్ళి చేసుకోకపోయినా బావుండేది. మీరెందుకు అసలు వీడితో పెళ్ళిచేసారు?" అడిగింది వర్ష.

చేతిలో చీపుర్ని నేలమీద పడేసి అడిగింది భవాని.

"మేం చేసామా? ఆ అబ్బాయిని చేసుకోకపోతే మేడమీంచి దూకి చచ్చిపోతానని చెప్తేకదా భయపడి చేసింది?"

"అన్నానూ? అనే ఉంటాను. నా చేతుల్తో నేనే నా గొయ్యి తవ్వుకున్నాను. అవును కదా. ఐనా నేను మేడమీంచి దూకుతానంటే నా కాళ్ళిరగ్గొట్టి కూర్చోపెట్టాలికానీ హిందీవాడితో నా పెళ్ళి చేస్తారా?"

కూతురి అభూయిత్యానికి భవానికి కోపం వచ్చింది.

మౌనంగా ఆ గది ఊడ్చేసి చీపురు యథాస్థానంలో పెట్టి, చేతులు కడుక్కుని ఏప్రాన్‌ని మేకుకి తగిలించి వచ్చి చెప్పింది.

"నేను వెళ్తాను. దగ్గరేకదా? దారి గుర్తుందిలే. ఆటోలో వెళ్ళిపోతా." వర్ష చేతులు జోడించి చెప్పింది.

"అమ్మ మహాతల్లీ. ఇన్ని నగలేసుకుని ఆటోలో వెళ్ళి, వాడు ఎక్కడికో తీసుకెళ్తే మీ ఆయనగారు నన్ను చంపి పాతిపెడతారు. ఐదు నిమిషాలాగు. మొహం కడుక్కుని వచ్చి దింపుతాను"

భవాని మౌనంగా సోఫాలో కూర్చుంది. వర్ష బెడ్‌రూంలోకి వెళ్ళింది. తలుపు తెరుచుకుని అల్లుడు వచ్చాడు. అతను బెడ్‌రూంలోకి వెళ్ళాడు. భవానికి మళ్ళీ దడమొదలైంది.

'ఇంకో రామ రావణ సమరం మొదలవుతుందో ఏమో? పెళ్ళింటికి చేరే మార్గం ఏమిటో భగవంతుడా!' దేవుడ్ని తల్చుకుంది.

అరగంట తర్వాత ఇద్దరూ నవ్వుతూ తుళ్ళుతూ బయటికి వచ్చారు.

"పదమ్మా నిన్ను దింపి మేం సినిమాకి వెళ్ళి వస్తాం" వర్ష హుషారుగా చెప్పింది. పెళ్ళింటి దగ్గర తల్లిని దింపాక చెప్పింది.

"అమ్మా! ఇంకో ఆరునెలల్లో పిల్లల్ని ప్లాన్ చేద్దామనుకుంటున్నాం. నువ్వు వచ్చి నా దగ్గర ఉండాలి. ఒక్కదాన్నే చేసుకోలేను."

భవాని మాట్లాడలేదు.

ఊరు వెళ్ళిన వారం రోజుల తర్వాత భవాని భర్తలేని సమయంలో కూతురికి ఫోన్ చేసింది.

"చిన్నా! నిన్న మన గుళ్ళో పంతులుగారికి నీ జాతకం చూపించాను. నువ్వు చాలా మంచి పిల్లవని, అల్లుడి మూలంగానే గొడవలని చెప్పాడు" చెప్పింది.

"అవునమ్మా. నిజం చెప్పాడు. నిన్నరాత్రి కూడా ఏం గోలో" సంతోషంగా చెప్పింది వర్ష. "ఏవో పూజలు చేస్తే అల్లుడు మంచివాడవుతాడట. నాన్నకి తెలీకుండా చేయిస్తున్నాను. కాకపోతే ఆ పూజలు అయ్యేదాకా నువ్వు ప్రెగ్నెంట్ అవకూడదుట. జాగ్రత్తగా ఉండు. నేను చెప్తాలే... ఐనా అల్లుడిలోని మార్పు చూడగానే నీకే అర్థమౌతుందిలే."

"సరే అమ్మా, నువ్వెప్పుడు చెపితే అప్పుడే వాడు నేను చెప్పింది వినేలా పూజలు చేయమను పంతులుగార్ని." వర్ష ఫోన్ పెట్టేసింది.

ఫోన్ పెట్టేసిన భవాని దేవుడికి దండం పెట్టుకుంది.

"దేవుడా! నా కూతురి అభూయిత్యం, దాని గయ్యాళి మనస్తత్వం తెలిసికూడా అల్లుడి మీద అపవాదు వేసాను క్షమించు."

తర్వాత గొణుక్కుంది.

‘ఇంతోటి సంసారానికి పిల్లలొక్కటే తక్కువ. భూమ్మీదకి తెచ్చి వాళ్ళని ఆ వాతావరణంలో పెంచడం కంటే పుట్టకపోవడమే మేలు.‘

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments